సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



ఆశీర్వాదం కోరుతూ..

ప్రచార పర్వం కొనసాగుతోంది. నాయకులు జోరుగా ఊరూరా తిరుగుతున్నారు.

- 8లో



18 నుంచి నామినేషన్లు

నామినేషన్ల స్వీకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

- 8లో

బంగారు విల్లు



కాశీబుగ్గ: శ్రీరామ నవమి సందర్భంగా కాశీబుగ్గకు చెందిన సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి బంగారు రేకుపై శ్రీరామనవమి అని రాస్తూ శ్రీరాముని విల్లును తయారు చేశారు. ఈ బంగారు విల్లు అందరినీ ఆకట్టుకుంటోంది.

న్యూస్‌రీల్

సైకత రామం



శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపే సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: మండలంలో గాజుల కొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన శ్రీరాముని సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కావడంతో మంగళవారం రాముని చిత్రాన్ని ఇలా తీర్చిదిద్దారు.

మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు నిధులు అందుబాటులో ఉంచామని, ఎక్కడ ఇబ్బందులు తలెత్తినా 24 గంటల్లో సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలో వేడి గాలులపై అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజరీ సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ఆరోగ్య సదుపాయాలను పెంచడంతోపాటు వేడిగాలులు ఎక్కువగా ఉన్న సమయంలో చేయకూడని పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను గురించి, పెంచిన వేతనం గురించి జిల్లా గణాంకాలను వివరించారు.

18న బాలల అంబేడ్కర్ గురుకుల ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని అంబేడ్కర్ బాలల గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల ప్రవేశాలకు దుప్పలవలస గురుకుల పాఠశాలలో ఈ నెల 18న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు దువ్వాడ దేవీంద్రరావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం వివరాలు వెల్లడించారు. 2024–25 ఏడాదికి ఐదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష రాసిన వారు కౌన్సెలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఫోన్ ద్వారా, ఎస్‌ఎంఎస్‌ల ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. దుప్పలవలస, కంచిలి, కొల్లివలస పాఠశాలల్లో ఖాళీ సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు.

'ఖర్చులు పక్కాగా నమోదు చేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచే అభ్యర్థుల ఖాతాలో ఖర్చు లెక్కించేందుకు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సాధారణ ఎన్నికలు 2024 నిర్వహణకి సంబంధించిన సన్నద్ధతపై మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా సమావేశాలు, సభలు నిర్వహిస్తే ఆ ఖర్చును ఇద్దరికీ సర్దుబాటు చేయాలని సూచించారు. జిల్లాకు ముగ్గురు ఐఆర్‌ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని, ఒకరు పార్లమెంటుకు, మిగిలిన ఇద్దరూ అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. సభలు, సమావేశాలు జరిగిన 24 గంటల్లోగానే అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని, ఆలస్యం చేయకూడదని, సమావేశాలకు అనుమతినిచ్చే విభాగం, ఎంసిఎంసి, ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, సంబంధిత ఇతర బృందాలతో సమన్వయం చేసుకొని ఖర్చులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలకు బుధవారమే ఆఖరి రోజుని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ సమయం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకూ మాత్రమేనని, మొత్తం ప్రక్రియను వీడియో గ్రఫీ చేయాలని, డీఎస్పీ స్థాయి అధికారి బందోబస్తు నిర్వహించాలని చెప్పారు.

శ్రీకాకుళం నగరంలోని కొత్తపేట- మిల్లు జంక్షన్ రోడ్డు



వికసిత సిక్కోలు
సౌకర్యాల సొబగులు

స్వాగత ద్వారాల నుంచి శ్మశాన వాటికల వరకు, కార్పొరేషన్ నుంచి పంచాయతీల వరకు, సచివాలయాల నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు, పెద్ద బజారు నుంచి పెద్దాస్పత్రి వరకు.. అన్నింటా ఈ ఐదేళ్లలో స్పష్టమైన మార్పు కనిపించింది. ధర్మాన మార్కు అభివృద్ధికి శ్రీకాకుళం నియోజకవర్గం మరోసారి సాక్షిగా నిలిచింది. నిమ్మళంగా ప్రవహించే నాగావళిలా ఒక్కో పనినీ పద్ధతిగా పూర్తి చేసుకుంటూ వెళ్లిన విధానం అందరికీ ముచ్చటగొలిపింది. ఓ వైపు వైఎస్ జగన్ సర్కారు సంక్షేమాలతో సామాన్యుడిని ఆదుకుంటే.. మరో వైపు ధర్మాన ప్రసాదరావు స్థానిక సమస్యలు పరిష్కరిస్తూ తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించారు.



నగరంలోని కొత్తపేటలో నిర్మించిన పార్క్

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో ఐదేళ్ల కాలంలో వినూత్న మార్పులు కనిపించాయి. రిమ్స్ ఆస్పత్రి ఇంతకు ముందు కంటే ఎంతో మెరుగుపడింది. ఊరి దారులన్నీ తళుక్కున మెరుస్తున్నాయి. కార్పొరేషన్‌లోనే కాదు శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో సైతం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు నిరంతరం నిర్వహించారు. రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఆస్పత్రులంటూ ప్రతి ఊరికీ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు. దీనికి తోడు రూ.1,207 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా సామాన్యులకు సాయం అందింది.

- మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన
- రూ.70 కోట్ల ఖర్చుతో రిమ్స్ ఆస్పత్రి, వైద్య కళాశాల అభివృద్ధి
- రూ.313.57 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.1,207 కోట్లు లబ్ధి

నాడు అలా నేడు ఇలా..



రూపురేఖలు మారిన వరం స్కూల్

నియోజకవర్గంలో నాడు–నేడు మొదటి, రెండు విడతల పనుల్లో రూ.60 కోట్లు ఖర్చుతో 103 పాఠశాల్లో పనులు చేపట్టారు. వీటిలో జెడ్పీ, ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, సాంఘిక సంక్షేమ, గిరిజన పాఠశాలలు మెరుగు పడ్డాయి. పాఠశాలల్లో 11 రకాల పనులు చేపట్టారు.

మురుగునీటి శుద్ధి

నగరంలోని పొన్నాడ వంతెన సమీపంలో మురుగునీటిని శుద్ధి ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు రూ.3 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. కార్పొరేషన్‌లో రూ.6.54 కోట్లతో నగరంలో సీసీ డ్రైనేజీ నిర్మాణం పట్టారు.

ఆస్పత్రులకు పునరుజ్జీవం


వైఎస్సార్ జిల్లా కేంద్రంలో రిమ్స్‌ను ఏర్పాటు చేసిన తర్వాత దాని గురించి అంతగా పట్టించుకున్నది వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రమే. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక రూ.70కోట్లతో అదనపు భవనాలు, ఎంఆర్ఐ, సీఆర్మ్, ఏఆర్మ్ వంటి అధునాతన యంత్రాలను సమకూర్చారు. అత్యవసర మందులతో పాటు కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, ఆంకాలజీ వంటి విభాగాలను ప్రవేశ పెట్టి 40కి పైగా వైద్యుల పోస్టులు, 200 వరకు బోధనేతర సిబ్బంది పోస్టులను నియమించారు. ఈ కారణంగా వంద వరకు ఉన్న వైద్య సీట్లు 150కి, మూడు వరకు ఉన్న పీజీ సీట్లు 65కు పెరిగాయి. రిమ్స్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులను మంజూరు చేయటమే కాకుండా రూ.3కోట్లతో శాశ్వత భవనాలను నిర్మించారు. నగరంలో ఐదు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలకు రూ.4.19 కోట్లు మంజూరు చేశారు. గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో ఏడు వెల్‌నెస్ కేంద్రాలకు రూ.1.76 కోట్లు మంజూరు చేశారు.



రిమ్స్ వైద్యకళాశాల ఆవరణలో నిర్మించిన అదనపు భవనం







శ్రీకాకుళం పట్టణంలో విద్యుత్ వెలుగులు



బైరివానిపేట వద్ద ప్రవేశ ద్వారం

సరికొత్త దారులు

- శ్రీకాకుళం నగరంలో రూ.25.92 కోట్లు వెచ్చించి 30.55 కిలోమీటర్ల దూరం సిమ్మెంటు రోడ్లు నిర్మించారు.
- గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో రూ.8 కోట్ల ఖర్చుతో 10 కిలోమీటర్ల సిమ్మెంటు రోడ్లును నిర్మించారు.
- రూ.6.80 కోట్లు ఖర్చుతో 8.5 కిలోమీటర్లు తారు రోడ్లను శ్రీకాకుళంలోను, రూ.2.8 కోట్లు ఖర్చుతో గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో తారు రోడ్లు వేశారు.
- శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ రూపురేఖలు మార్చారు.

కొత్త భవనాలు

నియోజకవర్గంలో రూ.3.9 కోట్లతో 34 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. అలాగే రూ.23 కోట్లతో 95 సచివాలయాలు ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలకు సంబంధించి పాత్రునివలసలో 2765 ఇళ్లు, రాగోలులో 1764, సింగుపురంలో 1311 ఇళ్లు మంజూరయ్యాయి. చాలా మంది గృహప్రవేశాలు కూడా చేశారు. చల్లపేటలో రూ.50 లక్షలతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

సుందర శ్రీకాకుళం

జిల్లా కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. నగరంలోనికి ప్రవేశ ప్రాంతాలుగా ఉన్న ఐదు చోట్ల ద్వారాలు నిర్మించేందుకు రూ.75 లక్షలు ఖర్చు చేశారు. రూ.2.85 కోట్ల ఖర్చుతో పార్కులను అభివృద్ధి చేశారు. సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.కోటి నిధులు ఖర్చు చేశారు. సెంటర్ లైటింగ్ స్తంభాలకు రంగురంగుల విద్యుత్ దీపాలు అమర్చేందుకు రూ.30 లక్షలు నిధులు విడుదల చేశారు. కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేశారు.

పనులు సంతృప్తినిచ్చాయి..



వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్‌తో పనిచేయడం సంతృప్తినిచ్చింది. వీరిద్దరూ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కోరే సీఎంలుగా గుర్తింపు పొందారు. వీరి పాలనలో నేను మంత్రిగా పనిచేయటం వల్ల శ్రీకాకుళం జిల్లాను, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించగలిగాను. జిల్లాలో చెప్పుకోదగ్గవిగా ఉన్న వైద్య కళాశాల, విశ్వ విద్యాలయం, నాగావళి నదికి కరకట్టల నిర్మాణం, పెద్దమార్కెట్ అభివృద్ధి, వంశధార ప్రాజెక్టు, శ్రీకాకుళం నగరానికి రక్షిత తాగునీటి పథకం, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేయగలిగాం. సంక్షేమ పథకాలు కూడా వీరిద్దరి పాలనలో అమలు జరిగినట్లుగా మరెవ్వరూ అమలు చేయలేకపోయారు. సంక్షేమంతో పాటు అభివృద్దే లక్ష్యంగా వీరు పనిచేయటంతో జిల్లాను ఎంతో అభివృద్ధి చేశాం. చేయాల్సింది చాలా ఉన్నా ఇప్పటి వరకు సాధించింది తృప్తినిచ్చింది. భవిష్యత్‌లో మరింత సంక్షేమ, అభివృద్ధి కోసం కృషి చేస్తాను.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి



80 అడుగుల రోడ్డు

వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధి (కొన్ని పథకాలు)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి మొత్తం రూ.లక్షల్లో
ఆసరా	42,135	9,552
అమ్మఒడి	28,708	16,043
వైఎస్సార్ చేయూత	40,631	1,14,008
పంటల బీమా	2,810	480.90
మత్స్యకార భరోసా	3,128	1,310.80
మత్స్యకార డీజిల్ రాయితీ	212	25.70
ఈబీసీ నేస్తం	429	119.70
జగనన్న చేదోడు	2,292	865.20
జగనన్న తోడు	2,883	958.40
జగనన్న వసతి దీవెన	7,983	2,185.18
జగనన్న విద్యా దీవెన	8,010	6,981.10
విదేశీ విద్యాదీవెన	02	76.79
కళ్యాణమస్తు	145	138.65
కాపునేస్తం	419	222.90
నేతన్న నేస్తం	222	220.56
పింఛన్ కానుక	35,382	47,132.68
రైతు భరోసా	22,643	13,149.99
సున్నావడ్డీ పంట రుణాలు	13,408	305.69
వాహన మిత్ర	2,313	491.70
ఆరోగ్యశ్రీ	7,933	4,170.21
వైఎస్సార్ బీమా	492	280.32
లా నేస్తం	22	39.60
సున్నా వడ్డీ (మహిళలు)	50,583	1,531
సున్నా వడ్డీ (రైతులు)	21,016	1,317
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	3,610	130.48
యంత్రసేవా పథకం	38	205.57
కరోనా సహాయం	86,474	9,072.66



ఆధునిక శ్మశాన వాటిక

నగరంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ సమీపంలో అత్యాధునిక శ్మశాన వాటికను రూ.1.47 కోట్లతో నిర్మించారు. ఇందులో దహన సంస్కారాలు పూర్తి చేసేందుకు గ్యాస్, విద్యుత్ ఆధారిత యంత్రాలను ఏర్పాటు చేశారు.

సమీకృత కలెక్టరేట్

అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి రూ.100 కోట్లు వరకు మంజూరు చేయగా ఆ తర్వాతి ప్రభుత్వాలన్నీ నిర్లక్ష్యం వహించాయి. వైఎస్ జగన్ కలెక్టరేట్ నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.40కోట్లు మంజూరు చేయటంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి.




కొత్తగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవనం

బై బై.. బాబు

- అధినేతకు షాకిచ్చిన గుండ దంపతులు
- రాజకీయాలకు దూరంగా ఉంటామని చంద్రబాబు ముందే చెప్పిన వైనం
- అభ్యర్థి మార్పు ఉండదని చంద్రబాబు స్పష్టీకరణ
- చంద్రబాబును కలవాలని గంటన్నర ముందు కలమటకు ఫోన్ చేసిన దూతలు
- ఇప్పటికప్పుడు రాలేనని ఫోన్‌లో చెప్పేసిన పాతపట్నం నేత





బాబు ఉన్న బస్సు నుంచి బయటకు వెళ్లిపోతున్న గుండ లక్ష్మీదేవి దంపతులు , వారు విడుదల చేసిన లేఖ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: బాబు దెబ్బకు జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులైన గుండ లక్ష్మీదేవి దంపతులు రాజకీయాలకు టాటా చెప్పేశారు. టికెట్ వస్తుందేమోనని దింపుడు కళ్లెం ఆశతో ఇన్నాళ్లా గడిపిన గుండ దంపతులకు టికెట్ మార్పు ఉండదని చంద్రబాబు స్పష్టం చేయడంతో రాజకీయాల్లో తాము ఉండలేమని ఆయన ముందే తేల్చి చెప్పేశారు. నేర ప్రవృత్తి కలిగిన వారికి, అవినీతి పరులకు పెద్దపీట వేసే మీలాంటి వారితో రాజకీయాలు చేయలేమని, ఏకంగా రాజకీయాలకే దూరంగా ఉండిపోతామంటూ గుండ లక్ష్మి దంపతులు చంద్రబాబుకు దండం పెట్టేశారు. మరో నాయకుడు కలమట వెంకటరమణ తాను వచ్చి బాబును కలవలేనంటూ ఫోన్‌లోనే తన అభిప్రాయాన్ని చెప్పేశారు. ఇప్పుడిది జిల్లా టీడీపీలో చర్చనీయాంశంగా మారింది.

రమ్మని పిలిచి..

హైదరాబాద్ పిలిపించుకుని గుండ దంపతులకు న్యాయం చేస్తానని చెప్పిన చంద్రబాబు జిల్లాకొచ్చినో చెప్పేశారు. మంగళవారం ఉదయం తనను కలవాలని కబురు పంపించడంతో హుటాహుటిన తన కుమారుడితో కలిసి గుండ అప్పల సూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులు పలాసలో బస చేసిన చంద్రబాబు వద్దకు వెళ్లారు. బస్సులో తనను కలిసిన గుండ దంపతులకు ముఖం మీదే ఆయన తన అభిప్రాయాన్ని చెప్పేశారు. శ్రీకాకుళం అభ్యర్థిని మార్చే ప్రసక్తి లేదని, ప్రస్తుత అభ్యర్థిని గెలిపించేందుకు పనిచేయాలని, అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవో...ఎమ్మెల్సీ పదవో ఇస్తానని...2029 ఎన్నికల్లో మీ అబ్బాయికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని హామీ ఇచ్చారు.

ముఖం చాటేసిన కలమట

పాతపట్నం టికెట్ ఆశించి భంగపడిన కలమట వెంకటరమణకు మంగళవారం ఉదయం 8.15గంటల సమయంలో చంద్రబాబు నుంచి ఫోన్ వెళ్లింది. 10 గంటల్లోపు పలాసలో బస చేసిన తమను కలవాలని కోరారు. దానికి కలమట నో చెప్పేశారు. 10 గంటల్లోపైతే రాలేనని చెప్పి ఇంటి వద్దే ఉండిపోయారు. అక్కడికి వెళితే ఆఫర్లు తప్ప మరేదీ ఉండదని అభిప్రాయానికి వచ్చేసి చంద్రబాబును కలవడానికి కలమట ఇష్టపడలేదని తెలుస్తోంది. అభ్యర్థి మార్చుతానన్న ప్రకటన తప్ప తనకు ఏ ఆఫర్ వద్దని, ఎలాగూ ఇండిపెండెంట్‌గా పోటీ చేయడానికి సిద్ధమైపోయాయని, మామిడి గోవిందరావుతో కలిసి పనిచేసేది లేదని తన కేడర్ వద్ద చెప్పేశారు. మధ్యలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఏదో రాయబారం చేయడానికి ప్రయత్నించినా, నేనున్నాని భరోసా ఇచ్చినా కలమట వెనక్కి తగ్గలేదు. మాటలొద్దు.. చేతలు కావాలని ఎంపీ వద్ద అన్నట్టుగా తెలుస్తోంది.

నచ్చేచెప్పేందుకు యత్నించినా... నో అంటూ ..



అన్నీ విన్న గుండ దంపతులు మీ రాజకీయాలకు నమస్కారం...మాకే పదవులొద్దు... నేరప్రవృత్తి గల వారికి, అవినీతి పరులకు పెద్దపీట వేసే తరుణంలో తామీ రాజకీయాల్లో ఉండలేమని...క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండిపోతామని చెప్పేసి బస్సు దిగేసి వెనక్కి వచ్చేశారు. వెళ్లిపోతున్న వారిని వెనక్కి పిలిచి నచ్చ చెప్పేందుకు ప్రయత్నించినా గుండ దంపతులు ఆగలేదు. సీరియస్‌గానే బయటికొచ్చేసి చంద్రబాబుకు ఏ విషయాలైతే చెప్పారో అదే విషయాలను ప్రస్తావిస్తూ ఒక నోట్ కూడా విడుదల చేశారు. అనుచరులు ఏదో ఒక దారి చూసుకోవాలని పరోక్షంగా చెప్పేశారు.

క్లుప్తంగా

టెక్కలి ఉప విద్యా శాఖాధికారిగా పి.విలియం



విలియంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

టెక్కలి: టెక్కలి ఉప విద్యా శాఖాధికారిగా పి.విలియం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. టెక్కలి మండలం పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఎఫ్ఏసీ ప్రాతిపదికన ఉప విద్యా శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మండల విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావుతో పాటు మరి కొంత మంది ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

నీలమణి తల్లికి పుష్పాభిషేకం



గులాబీలతో పుష్పాభిషేకం

సారవకోట: మండలంలోని అవలింగి శ్రీ నీలమణి అమ్మవారికి మంగళవారం 10,116 గులాబీలతో పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ ఆలయంలో సోమవారం నుంచి జరుగుతున్న వసంత త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గులాబీలతో పుష్పాభిషేకం నిర్వహించినట్లు అర్చకులు చల్లపల్లి భాస్కరరావు ఆచారి తెలిపారు. బుధవారంతో ఈ ఉత్సవాలు ముగించనున్నట్లు వారు తెలిపారు.

స్విమ్మింగ్‌లో శిక్షణకు జమ్ము విద్యార్థి ఎంపిక



ప్రేమ్‌కుమార్‌ను సత్కరిస్తున్న చిట్టిబాబు

నరసన్నపేట: మండలంలోని జమ్ముకు చెందిన టెంక ప్రేమ్‌కుమార్‌కు యానాంలో రెసిడెన్షియల్ స్విమ్మింగ్ శిక్షణకు ఎంపికయ్యాడు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యానాంలో డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న క్యాంపునకు 21న హాజరు కావాలని సమాచారం వచ్చింది. దీంతో విద్యార్థితో పాటు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేటలో 9వ తరగతి చదువుతున్న ప్రేమకుమార్‌కు ఈ అవకాశం రావడం ఆనందంగా ఉందని వైఎంసీ కార్యదర్శి గొద్దు చిట్టిబాబు అన్నారు. మంగళవారం ప్రేమకుమార్‌ను చిట్టిబాబు సత్కరించి అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ సభ్యులు గ్రామస్తులు

సంతబొమ్మాళి: మండలంలోని కాపుగోదాయవలస గ్రామానికి చెందిన బి.జనార్దన్ మరణించడంతో ఆ కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు ఉపాధి హామీ కూలీలు, విదేశాల్లో ఉన్నవారు, గ్రామా ల నుంచి నగదును సేకరించి రూ.1,35,500 మొత్తాన్ని మృతుడి భార్య కస్తూరికి అందజేశారు.

మేడపై నుంచి పడి చిన్నారి మృతి

టెక్కలి రూరల్: మండలంలోని బన్నువాడ గ్రామానికి చెందిన రుంకాన శశిభూషణరావు అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి పంజాబ్‌లో ఉంటున్నాడు. వారి ఒక్కగానొక్క కుమారుడు సుశాంత్(8) సోమవారం ఇంటి మేడపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలుడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతి వార్తతో బన్నువాడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నెలరోజులు క్రితమే ఆ కుటుంబం స్వగ్రామానికి వచ్చింది. నెల గడవక ముందే ఇలా జరగడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు.

ఆశీర్వాదం కోరుతూ..



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



శ్రీకాకుళంలో భారీ ర్యాలీతో వెళ్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



కాశీబుగ్గ: మందస మండలం కిల్లోయిలో వర్షంలో సైతం మంత్రి సీదిరి అప్పలరాజు ప్రచారం



ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 16వ వార్డులో ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



హిరమండలం : సత్యజగన్నాథపురం గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పోలాకి: దీర్ఘాశిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కోటబొమ్మాళి: మెయిన్‌రోడ్డులో కూరగాయలు విక్రయిస్తున్న మహిళతో ముచ్చటిస్తున్న దువ్వాడ శ్రీనివాస్



జి.సిగడాం: వెంకయ్యపేటలో కిరణ్‌కుమార్‌కు తిలకం దిద్దుతున్న మహిళలు

ప్రజల ఆశీర్వాదం కోరుతూ నాయకులు పల్లెపల్లెనా తిరుగుతున్నారు. ఓటు వేయాలని అభ్యర్థిస్తూ.. చేసిన పనులు, చేయబోయే పనులను వివరిస్తున్నారు. గృహిణులు, వ్యాపారులు, పాదచారులు అని లేకుండా అందరినీ ప్రేమగా పలకరిస్తూ ప్రచారం చేస్తున్నారు.

మీ హయాంలో కట్టిన ఒక్క ప్రాజెక్టయినా చూపించగలరా..?

- చంద్రబాబుపై మంత్రి సీదిరి ధ్వజం



పలాసలో మాట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తాను నిర్మించిన ఒక్క ప్రాజెక్టు అయినా చూపించగలరా అని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెత్తందారుల పక్కన చేరి దళితుల కోసం మాట్లాడటం పీవీ రమేష్ అవగాహనా రాహిత్యమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎవరి పాత్ర ఏమిటో లేఖలే చెబుతున్నాయని అన్నారు. చంద్రబాబు వ్యవసాయ రంగానికి ఏం మేలు చేశారో చెప్పాలని, ఒక్క మెడికల్ కాలేజీనైనా స్థాపించారా అని ప్రశ్నించారు. 980 కిలోమీటర్ల తీర ప్రాంతంలో బాబు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. మూలపేట పోర్టు, బుడగట్ల పాలెం హార్బర్, నువ్వలరేవు, మంచినీళ్లపేట హార్బర్‌లు నిర్మిస్తున్నామని, భోగాపురం ఎయిర్‌పోర్టు కడుతున్నామని చెప్పారు. రుషికొండ గురించి మాట్లాడుతున్న వారికి గతంలో టీడీపీ హయాంలోనే రామానాయుడు కట్టిన ఫిల్మ్ సిటీ కనిపించలేదా అని ప్రశ్నించారు. కోటి డబ్బై లక్షల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని లోకేష్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రజలను మభ్య పెట్టడం తప్ప తండ్రీ కొడుకులకు ఇంకేమీ తెలియదని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు అసలు ఉద్దానంలో ఎన్ని డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి, ఎంతమందికి పింఛన్ వస్తుందో తెలుసా అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో 700 మందికి రూ.2500 పింఛను ఇచ్చారని, జగనన్న ప్రభుత్వంలో ప్రతి డయాలసిస్ రోగికి రూ.10 వేలు పింఛన్ రాష్ట్రవ్యాప్తంగా ఇస్తున్నామని చెప్పారు. ఉద్దానం ప్రాంతానికి రూ.7 కోట్లు ఖర్చు పెట్టి చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారని, వైఎస్ జగన్ హయాంలో రూ.700 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు కట్టామన్నారు. తిత్లీ సమయంలో ప్రజలంతా శోకంలో ఉంటే ఫ్లెక్సీలు వేయించుకున్న నాయకుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. పరిహారాన్ని సొంత పార్టీ నేతలకు దోచి పెట్టారని విమర్శించారు. మా ప్రాంతాన్ని బానిసలుగా చేసిన కుటుంబం గౌతు కుటుంబం అని అన్నారు. వారి వల్ల అనేక మంది అడవుల బాట పట్టారని, ఇన్నేళ్లూ ప్రజలు అధికారం ఇస్తే అభివృద్ధి చేయకుండా గాడిదలు కాశారా అని అన్నారు. తనపై చంద్రబాబు ఆరు కేసులు పెట్టించారని తెలిపారు. వైఎస్ జగన్ పాలనా కాలంలో తలసరి ఆదాయం ఘనంగా పెరిగిందని, చంద్రబాబు హయాంలో ఎంత పెరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మాటలు నమ్మడానికి జనం సిద్ధంగా లేరని అన్నారు.

'లీజు పేరిట ఆక్రమణ తగునా..?'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని టీడీపీ కార్యాలయాన్ని నిబంధనలకు విరుద్ధంగా 99 ఏళ్ల పాటు ఏడాదికి రూ.25 వేలు చొప్పున అతి చౌకగా లీజు రాయించుకొని ఆక్రమణకు పాల్పడడం టీడీపీకి తగదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పొన్నాడ రుషి అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ ధర్మాన 80 అడుగుల రోడ్డు వేసిన తర్వాత భూముల విలువ పెరగడంతో విలాసవంతమైన ఇళ్లు నిర్మించుకున్నారని అన్నారు. దళితులను ఉద్దేశించి గతంలో చంద్రబాబు నాయుడు అన్న మాటలు ఎవరూ మర్చిపోలేదన్నారు. వైఎస్ జగన్ మానవతావాది కాబట్టే నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ సంబోధిస్తారని తెలిపారు. 2019 క్యాబినెట్ విస్తరణలో ఓ హోం మినిస్టర్‌గా సుచిరితను, శాసన మండలి చైర్మన్‌గా కొయ్యా మోషన్‌రాజును, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా మేరుగు నాగార్జునను నియమించారని, పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబూరావును రాజ్యసభ సభ్యునిగా నియమించి చట్టసభల్లో వారికి అపారమైన గౌరవం ఇచ్చారన్నారు. దళితుల గొంతులో ప్రాణమున్నంతవరకు సీఎం జగన్ వెంట, మంత్రి ధర్మాన వెంటే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్, ప్రధానకార్యదర్శి యజ్జల గురుమూర్తి, కార్యదర్శి మెరక సూర్యనారాయణ, లోపింటి చిట్టిబాబు, కొమ్ము గురువులు, నల్లబారికి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం బయల్దేరిన బస్సు



భద్రాచలం బయలుదేరిన ఆర్టీసీ ప్రత్యేక బస్సు

శ్రీకాకుళం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళం నుంచి భద్రాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు బయల్దేరింది. ఈ బస్సును శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు, అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలంలో రాముని దర్శించుకునేందుకు శ్రీకాకుళం నుంచి 30 మంది ప్రయాణికులు, విశాఖపట్టణం నుంచి 15 మంది బయల్దేరారని తెలిపారు. వీరు తమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని మళ్లీ గురువారం వేకువజామున 6 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటారని తెలిపారు.

'బీఎస్ఎన్ఎల్‌ను పరిరక్షించుకోవాలి'

శ్రీకాకుళం అర్బన్: భారత సంచార నిగమ్ లిమిటెడ్ సంస్థను పరిరక్షించుకోవాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు పిలుపునిచ్చారు. బీఎస్ఎన్ఎల్ ఈయూ ఆలిండియా పిలుపు మేరకు మంగళవారం శ్రీకాకుళంలోని సంచార భవన్ వద్ద బీఎస్ఎన్ఎల్ ఈయూ నాయకులు, ప్రతినిధులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకవైపు ప్రైవేటు కంపెనీలు దేశవ్యాప్తంగా 5జీ సేవలు అందిస్తుంటే ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్ కంపెనీ మాత్రం ఇంకా 4జీ సేవలు అందించడం లేదన్నారు. తద్వారా నెలకు లక్షలాది మొబైల్ కనెక్షన్‌లు ప్రైవేటు కంపెనీలకు తరలిపోతున్నాయన్నారు. అయినప్పటికీ దిద్దుబాటు చర్యలను చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. తక్షణమే బీఎస్ఎన్ఎల్ సంస్థకు 4జీ/5జీ సేవలకు సంబంధించిన ఎక్విప్‌మెంట్‌ను సరఫరా చేసి వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని డిమాండ్ చేశారు.

బీసీలంటే చంద్రబాబుకి నచ్చదు

- నాయీ బ్రాహ్మణుల సమావేశంలో మంత్రి ధర్మాన



నాయీబ్రాహ్మణుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నాయీ బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తామని చిన్నచూపుగా చంద్రబాబు మాట్లాడిన తీరు ఇంకా ఎవరూ మర్చిపోలేదని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. చంద్రబాబుకు బీసీలంటే నచ్చదని అన్నారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం టౌన్‌హాల్‌లో నాయీ బ్రాహ్మణులతో ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు టీటీడీ బోర్డులో మెంబర్‌గా అవకాశం కల్పించి మిగిలిన కులాలతో పాటుగా సమాజంలో గౌరవం పెంచిన పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. అలాగే దేవాలయాల్లో మేలు కొలుపు కోసం అవకాశం కల్పించామని, అరసవల్లి దేవాలయంలో ట్రస్టుబోర్డు మెంబర్లుగా అవకాశాలు ఇచ్చామని గుర్తు చేశారు. పేదలు ధనవంతులతో సమానంగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి అనే కలలను సాకారం చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు వస్తున్న విశేష స్పందనను చూసి ఓర్వలేనితనంతో దాడులు చేయిస్తున్నారని, వాటికి వైఎస్ జగన్ బెదరడని తెలిపారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, నాయీబ్రాహ్మణ సంఘనాయకులు కొరుపూరు గజపతి, తాళ్లవలస కొండలరావు, విజయ్‌భాస్కర్, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి కొత్తపేట గ్రామస్తులు



మంత్రి ధర్మాన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కొత్తపేట గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్:

శ్రీకాకుళం నగర పరిధిలోని కొత్తపేట, బర్మా కాలనీ, బాదుర్లపేటకు చెందిన 50 కుటుంబాలు పెదపాడులోని ధర్మాన క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో కల్లేపల్లి సోముబాబు, గంగు ఆదినారాయణ, గంగు రామారావు, గంగు జగదీశ్వరి, కునుకు కోటీశ్వరావు, గంగు సూర్యనారాయణ, గంగు రాజు, గంగు వెంకటరమణ, గంగు చిన్న రమణ, తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని మంత్రి సాదరంగా ఆహ్వానించారు.



సందూరులో టీడీపీ నాయకుడు లండ సారథికి కండువా వేస్తున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకులు

కాశీబుగ్గ: మందస మండలం కొంకడాపుట్టి పంచాయతీ సందూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పది కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం సందూరులో పర్యటించగా టీడీపీ నాయకుడు లండ సారథితో పాటు పది కుటుంబాలు పార్టీలో చేరాయి. వారందరికీ పార్టీ కండువాలు వేసి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, పార్టీ అధ్యక్షులు అగ్గున సూర్యం, నాయకులు లండ కోదండరావు, దాసరి ప్రసాద్, కాముటూరి కాంతారావు, అండ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ తప్పుగా ప్రవర్తిస్తున్నాడని..

- ఆటో నుంచి దూకిన యువతి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు

టెక్కలి రూరల్: ఒక ఆటో డ్రైవర్ తన శరీరంపై చేతులు వేసి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఓ యువతి వెళ్తున్న ఆటో నుంచి దూకేసిన సంఘటన కోటబొమ్మాళి మండలం చిన్నసాన వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, బాధితురాలి తల్లి తెలిపిన వివరాలు ప్రకారం .. కోటబొమ్మాళి మండలం చిన్నసాన గ్రామానికి చెందిన ఓ మహిళ తన కుమార్తెతో కలిసి టెక్కలి వచ్చారు. అక్కడ టీవీతో మరికొంత సామగ్రిని కొనుగోలు చేశారు. వాటిని తీసుకెళ్లేందుకు ఆ షాపు యజమాని టెక్కలి కి చెందిన ఆటోకు చెప్పడంతో ఆ ఆటోలో సామగ్రి లోడ్ చేసుకుని తన కూతురితో కలసి ఇంటికి వెళ్లారు. సామగ్రి కిందకు దించుతుండగా కొన్ని సామాన్లు కనిపించకపోవడంతో కుమార్తె వెతుక్కుంటూ ఆ దారిన వెళ్లింది. అదే దారిలో కలిసిన ఆటో డ్రైవర్ ఆమెను బండిలో కూర్చోవాలని కోరాడు. కొంత దూరం వెళ్లాక అతను తేడాగా వ్యవహరించడంతో ఆ యువతి ఆటో నుంచి దూకేసింది. అది చూసి ఆటో డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ యువతిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

'వేసవి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

శ్రీకాకుళం క్రైమ్ : వేసవిలో జరిగే అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాదరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని సన్‌షైన్ స్కూల్ విద్యార్థులకు ఏడీఎఫ్ఓ వరప్రసాదరావు తమ సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎఫ్ఓ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు వేసవి వేడిగాలుల వల్ల 33 వరకు చిన్నచిన్న అగ్నిప్రమాదాలు సంభవించాయన్నారు. ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు విశదీకరించారు. వారోత్సవాల్లో భాగంగా అపార్ట్‌మెంట్లు, స్కూళ్లు, గ్యాస్ గొడౌన్లు, పెట్రోల్ బంకులు తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



తీవ్రగాయాల పాలైన తరుణ్

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ వీధికి చెందిన పడాల తరుణ్ అనే యువకుడిని మంగళవారం లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... తరుణ్ మెళియాపుట్టి జంక్షన్ వద్ద గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి రోడ్డుపైకి వెళ్లి ఫోన్ మాట్లాడుతుండగా శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. యువకుడి కుడికాలి తొడ భాగం నుజ్జునుజ్జయ్యింది. దీంతో అతడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడి స్నేహితులు ఇచ్చిన సమాచారం మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

'18 నుంచి నామినేషన్ల స్వీకరణ'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 18వ తేదీ నుంచి సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు రిటర్నింగ్ అధికారులందరూ సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. ఆయన మంగళవారం సాయంత్రం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, రోజువారి నివేదికల పంపిణీ, ఎపిక్ కార్డుల జనరేషన్, సీజర్ మేనేజ్‌మెంట్ రిపోర్టు తదితర అంశాలపై సమీక్షించారు. నిఘా బృందాలను పటిష్టం చేయాలని, అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఆర్వోలు నూరుల్ కమర్, భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, లక్ష్మణ మూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు పాల్గొన్నారు.